దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, అక్టోబర్ 7 : జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని నిర్వహించేందుకు, నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీకి చెందిన ఐదుగురు నాన్ అఫీషియల్ సభ్యుల కోసం, ఎస్సీ, ఎస్టీ కాకుండా ఇతర వర్గం నుంచి ఎన్‌జీవోస్‌తో అనుబంధం ఉన్న ముగ్గురు నాన్ అఫిషియల్ సభ్యులను ఎంపిక చేసేందుకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం రూం నంబర్ 113లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

టెక్నికల్ శిక్షణ కోసం..

కామారెడ్డి, అక్టోబర్ 7 : సెట్విన్ టెక్నికల్ శిక్షణ ఇనిస్టిట్యూట్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ టీటీఐ తెలంగాణ ప్రభుత్వ కో ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహిందీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా సర్టిఫికేట్ అందజేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7386180456, 7989159121 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దుకాణానికి వేలం

ఆలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

మాచారెడ్డి, అక్టోబర్ 7 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో లడ్డూ, పులిహోర ప్రసాదం విక్రయాల దుకాణానికి సోమవారం వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ పరిశీలకుడు సుమన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. చుక్కాపూర్ గ్రామానికి చెందిన వీ.నర్సింగరావు రూ.17 లక్షల 21 వేలకు దుకాణాన్ని దక్కించుకున్నాడు. దీని కాలపరిమితి రెండు సంవత్సరాల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. వేలంలో ఎనిమిది మంది పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, ఆలయ సిబ్బంది సంతోష్, సురేందర్, లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మాచారెడ్డి, అక్టోబర్ 7 : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం మండలాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా వేల్పుగొండ విజయ్, ఉపాధ్యక్షులుగా పోదర్ల సురేశ్, వినయ్, ప్రధానకార్యదర్శిగా రాము, లింగం, గౌరవ అధ్యక్షుడిగా మామిడి లక్ష్మణ్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకట్రాములు, హరీశ్, రవి, సురేశ్, రాజెల్లం తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 82 ఫిర్యాదులు

కామారెడ్డి, అక్టోబర్ 7 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 82 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాలేవు..

రాజంపేట్, అక్టోబర్ 7 : రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ఫిర్యాదులు రాలేవని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అశీష్ సంగ్వాన్

'తహసీల్దార్ పర్మిషన్ ఇవ్వడం లేదు'

మాచారెడ్డి, అక్టోబర్ 7 : ఇంటి ఆవరణలో ఉన్న టేకు చెట్లను తొలగించేందుకు తహసీల్దార్ పర్మిషన్ ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ముస్తాక్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల్వంచ మండలంలోని ఏల్పుగొండ గ్రామానికి చెందిన దుర్జాన బేగం ఇంటి ఆవరణలో మూడు టేకు చెట్లు ఉన్నాయని, వాటి ని తొలగించడానికి తహసీల్దార్ పర్మిషన్ పేరుతో కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. తన ఇంటి ఆవరణ లో టేకు చెట్లను తీసివేయాలని అటవీ శాఖ అధికారులను సం ప్రదించగా గ్రామ కార్యదర్శితో పాటు తహసీల్దార్ నుంచి పర్మిషన్ లెటర్ తీసుకు రావాలని వారు సూచించారన్నారు. గ్రామ కార్యదర్శి పర్మిషన్ లేటర్ ఇచ్చాడన్నారు. కానీ.. తహసీల్దార్ జయంత్‌రెడ్డి వద్దకు వెళ్లి పర్మిషన్ కోసం అడిగితే దురుసుగా మాట్లాడుతూ బూతులు తిడుతున్నాడని ఆరోపించారు. మండల ప్రజలు తహసీల్దార్‌ను కలువడానికి వెళ్తే కనీసం మర్యాద లేకుండా మాట్లాడుతున్నాని, అధికారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ముస్తాక్‌హుస్సేన్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 7 : బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్, గర్భిణులు, బాలింతల వివరాల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పథకాలను సమర్థవంతంగా అందించాలని అన్నారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, అక్టోబర్ 7 : ప్రాజెక్టు ఎగువ భాగం నుంచి వరద కొనసాగుతుండడంతో సోమవారం సాయంత్రం నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 18,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని, వరద గేట్ల ద్వారా 17,000 క్యూసెక్కులు, ప్రధాన కాలువ ద్వారా 1400 క్యూసెక్కులు, మొత్తం 18,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 1405.00 అడుగులకు (17.802 టీఎంసీలు)గాను, ప్రస్తుతం 1404.86 అడుగులు (17.600 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ఆయన వివరించారు.

నాడు సర్పంచ్.. నేడు కూలీ

ఉపాధి కల్పించాలని వేడుకోలు

కామారెడ్డి, అక్టోబర్ 7 : నాడు సర్పంచ్‌గా పనిచేసిన ఓ ప్రజాప్రతినిధి నేడు కూలీగా మారాడు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో 2014లో ఎస్టీ సామాజిక వర్గానికి సర్పంచ్ స్థానానికి రిజర్వేషన్ వచ్చింది. గ్రామంలో పందులను మేపుతూ కుర్ర ఎల్లయ్య జీవనాన్ని సాగించేవాడు. ఎస్టీ రిజర్వేషన్ రావడం, ఎల్లయ్య ఒక్కడే ఉండడంతో ఆయనను గ్రామస్తులు సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పదవీ కాలంలో కూడా తన వృత్తి అయినటువంటి పందులను కాసేవాడు. సర్పంచ్ హోదాలో ఇలాంటివి చేయొద్దని అధికారులు చెప్పడంతో ఆ వృత్తి కాస్తానే మానేసి పందులను అమ్మేసి కేవలం ప్రజాజీవితానికి అంకితమయ్యాడు.

ఐదేండ్లు పూరి గుడిసెలోనే నివసించాడు. తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇల్లు ఒక్కటి మాత్రమే ఎల్లయ్యకు అందజేశారు. పదవీ కాలం ముగియడంతో తాను కాస్తున్న పందులు లేకపోవడంతో ఏ పని చేయాలో తోచక కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనను ప్రభుత్వం ఆదుకొని ఉపాధి కల్పించాలని కోరుతున్నాడు.

కూలీ పని చేస్తున్న మాజీ సర్పంచ్ కుర్ర ఎల్లయ్య

పట్టణంలో పండుగ సందడి

బాన్సువాడ, అక్టోబన్ 7 : బాన్సువాడ పట్టణం బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సందడిగా మారింది. ఒకవైపు బట్టల దుకాణాలు, మరోవైపు బతుకమ్మ పండుగకు గునుక పువ్వు, బంతిపూలు, ఉమ్మడి కాయ తదితర సామన్లను ప్రజలు కొనుగోలు చేస్తుండడంతో పట్టణంలో పండుగ కళ ఉట్టిపడుతున్నది.

బాన్సువాడలో మోస్తరు వర్షం

బాన్సువాడ, అక్టోబర్ 7 : బాన్సువాడతోపాటు బీర్కూర్, నస్రుల్లాబాద్ ఇతరాత్ర మండలాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వాతావరణం చల్లబడి, గాలిదుమారంతో కూడిన గాలులు వీచి వర్షం కురిసింది. వరి పంట చేతికి వస్తున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. చేతికొచ్చిన పంట నేలకు వంగిపోతున్నదని తెలిపారు.

రేపు డివిజన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

బాన్సువాడ, అక్టోబర్ 7 : పట్టణంలోని సమీకృత కార్యాలయాల సముదాయం డివిజన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ నెల 9న బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నట్లు సబ్ ట్రెజర్ కార్యాలయ ఏటీవో జగన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరవుతారని తెలిపారు. ప్రతి శాఖ నుంచి ఉద్యోగులు ఒక బతుకమ్మను సొంతంగా తయారు చేసి తీసుకొని రావాలని సూచించారు. ఆయా డిపార్ట్‌మెంట్ల నుంచి తీసుకొచ్చిన బతుకమ్మల్లో ఉత్తమమైన మూడు బతుకమ్మలను ఎంపిక చేసి పురస్కారాలను సబ్ కలెక్టర్ అందజేస్తారని తెలిపారు. బుధవారం 2 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి ఉద్యోగులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెలే రాక

భిక్కనూరు, అక్టోబర్ 7 : మండల కేంద్రానికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం రానున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేశ్ తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదులు నిల్

లింగంపేట, అక్టోబర్ 7: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యా దులు రాలేదని తహసీల్దార్ నరేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా వాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో నరేందర్, ఎంపీవో మల్లారీ, ఏపీఎం చామంతి శ్రీనివాస్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామంలో మరొక్క ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు విద్యుత్‌శాఖ డీఈ విజయసారథికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువ అవుతోందన్నారు. దానివల్ల తరచుగా ఫ్యూజ్‌లు పోతున్నాయని పేర్కొన్నారు. గ్రామానికి మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించాలని వారు కోరారు. అంతేకాకుండా చాలా చోట్ల విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని, కొన్ని చోట్ల స్థంబాలకు సపోర్ట్ వైర్లు కూడా లేవన్నారు. పంటపొలాల్లో కొన్ని స్థంబాలు వంగిపోయి ఉన్నాయని, వీధుల్లో కొన్ని ఇనుప స్థంబాలను తొలగించాలని, అవి అలాగే ఉండడంతో వర్షాలు పడినప్పుడు ఎర్త్ వస్తోందన్నారు. అందువల్ల తమ గ్రామానికి సంబంధించిన విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వారు డీఈని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక నాయకులు బబ్లూ, శంకర్, తదితరులు ఉన్నారు.

బుద్ధ విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం అందజేత

మద్నూర్, అక్టోబర్ 7: మండలకేంద్రంలో బుద్ధవిగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన తహసీల్దార్ గంగాధర్ 65 వేల రూపాయల నగదును తథగత్ బుద్ధవిహార్ కమిటీకి సోమవారం అందజేశారు. త్వరలో ప్రతిష్ఠించనున్న విగ్రహానికి తనవంతుగా విరాళం ఇచ్చానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, కమిటీ సభ్యులు మనోజ్, పవన్, దత్తు మహరాజ్, సుభాష్, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్ ఆదేశాల మేరకు లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం స్థానిక నాయకులు అందజేశారు. పట్టణంలోని రెండో వార్డులో నివాసముంటున్న వడ్ల వీరమణికి రూ.16వేల విలువ గల చెక్కును ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌గౌడ్, మంచిర్యాల విద్యాసాగర్, ప్రకాశ్, ప్రశాంత్, అశోక్, మహేశ్, సతీశ్, బాల్‌కిషన్ తదితరులున్నారు.

టీఎన్జీవోస్ ప్రాథమిక సభ్యత్వ నమోదు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం టీఎన్జీవోస్ యూనిట్ అధ్యక్షుడు లచ్చిగారి మహిపాల్ ఆధ్వర్యంలో ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ఐసీడీఎస్, మున్సిపల్ ఉద్యోగుల సభ్యత్వ నమోదును చేసినట్లు టీఎన్జీవోస్ యూనిట్ అధ్యక్షుడు మహిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, టీఎన్జీవోస్ కార్యదర్శి వారాల శరణ్‌కుమార్, వసంతలక్ష్మి, స్వాతి, రాజాగౌడ్, అరుణ్, ముఖీద్, రవి, నర్సింలు, మున్సిపల్ ఉద్యోగులు, ఐసీడీఎస్ ఉద్యోగులు ఉన్నారు.

త్రిలింగేశ్వరాలయంలో అభిషేకాలు

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 7: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన త్రిలింగేశ్వ రాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని అభిషేకాలు చేశారు. అనంతరం శివలింగాలను తీరొక్క పూలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాల వితరణ చేపట్టారు. రాత్రి వేళ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన, సంకీర్తన నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు తెలిపారు.

అలంకరించిన త్రిలింగేశ్వరుడు

దుర్గామండపాల వద్ద ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డి శ్రీరాంసేన దుర్గామండలి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల

శ్రీసీతారాముల కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితుడు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: దుర్గా నవరాత్రుల్లో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని న్యూ ఆబాదీ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీరాంసేన దుర్గా మండపం వద్ద దీక్షాధారులు ప్రతిరోజూ ఆయా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ కాలనీ అంతా పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. సోమవారం శ్రీరాంసేన దుర్గామండపం వద్ద వేదపండితుడు ప్రణయ్‌జ్యోషి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, సీఐ రవీందర్‌నాయక్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజాకార్య క్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎరుకల సాయిలు, నాగం రాజయ్య, బబ్లు, డాక్టర్ మారుతీరావు, నునుగొండ శ్రీనివాస్, గాదె తిరుపతి, సంగని పోచయ్య, జంగం నీలకంఠం అప్ప, సుభాష్ అప్ప, బిట్ల సురేందర్, మర్రి బాల్‌కిషన్, మంచిర్యాల విద్యాసాగర్, ప్రశాంత్‌గౌడ్, దీక్షాధారులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్‌ల పనితీరు పరిశీలన

ఎల్లారెడ్డి పట్టణంలోని హైమాస్ట్‌లైట్‌లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్

పతంజలి యోగాసమితి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: పట్టణంలోని హైమాస్ట్ లైట్‌ల పనితీరుని సోమవారం మున్సిపల్ చైర్మెన్ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. పట్టణంలోని శివాజీ చౌక్, వైశ్యభవన్ చౌరస్తా, గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా వద్ద గల హైమాస్ట్ లైట్‌లను ఆయన పరిశీలించి, వాటిని మరమ్మతు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. వీటితోపాటు వెలగని వీధిదీపాలను కూడా వెంటనే మరమ్మతు చేయిస్తామని, పట్టణంలో ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, గాదె తిరుపతి, సుభాష్‌అప్ప, సంగని పోచయ్య, బిట్ల సురేందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో సన్మానం..

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 7: నూతన మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు సన్మానాల పరంపర కొనసాగుతోంది. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని వైశ్యభవన్‌లో పతంజలి యోగాసమితి అధ్వర్యంలో శాలువా కప్పి, జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పతంజలి యోగాసమితి సభ్యులు నామ శ్రీకాంత్, నాగరాజ్‌గౌడ్, మాశెట్టి వెంకటేశం, చేపూరి చంద్రం, అవుసుల ఈశ్వర్, డాక్టర్ మారుతీరావు, కంచర్ల శ్రీనివాస్, కృష్ణ, జ్యోషి శ్రీధర్‌రావు, సిద్ధి చక్రధర్, సుభాష్ అప్ప, రవి, పంతులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో..

మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బబ్లు, సాయిబాబు, డాక్టర్ దత్తు, అమృ తరావు, సంజీవులు, పద్మారావు, సాయిలు, మొగులయ్య తదితర సభ్యులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులను పరిశీలించిన ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 7: మండలంలోని ఆత్మకూర్ గ్రామాన్ని సోమవారం ఎంపీడీవో ప్రభాకర్ పరిశీలించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రవీందర్‌కు సూచించారు. రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పండుగ సమీపిస్తున్నందున వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 7: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఆర్ నాయకులను సోమవారం మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు. గ్రామ తాజామాజీ సర్పంచి కృష్ణ తల్లి తీవ్ర అనార్యోగంతో ఉండటంతో..వెళ్లి ఆయనను పరామర్శించారు. కృష్ణకు ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ విమల భర్త లక్ష్మయ్యకు ఇటీవల కిడ్నీకి స్టంట్ వేశారు. ప్రాణాల నుంచి బయటపడిన ఆయనను ఇంటికి వెళ్లి పరామర్శించారు. భయపడవద్దని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, నాయకులు దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఏఎమ్‌సీ వైస్ ఛైర్మన్ సాయిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కృష్ణ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

బిచ్కుంద ఐటీఐలో

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో నూతన కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కింద తెలిపిన కోర్సుల్లో చేరాలని సూచించారు. మాన్యుఫాక్చరింగ్ కంట్రోల్ ఆటోమెషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిషన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ వెరిఫైడ్ మెకానిక్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులలో ఆసక్తి ఉన్న వారు 10వ తరగతి పాసై ఉండి ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, నమోదు పత్రాలను బిచ్కుంద ఐటీఐ కళాశాలలో సమర్పించాల ని ఆయన సూచించారు.

నేడు అన్నారం గ్రామానికి ఎమ్మెల్యే రాక

రామారెడ్డి అక్టోబర్ 7 : మండలంలోని అన్నారం గ్రామానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మంగళవారం రానున్నట్లు మండల తహసీల్దారు సువర్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతు వేదిక వద్ద ఆయన మండలంలోని రెడ్డిపేట్, అన్నారం, మద్దికుంట గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను అందజేస్తారని ఆమె పేర్కొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

బోరు మోటారు ప్రారంభిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బోరు మోటారును అధికారులు ప్రారంభించారు. బస్టాండ్ ప్రాంతంలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు బోరు వేయించారు. సోమవారం సాయంత్రం బోరు మోటారు బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, పంచాయతీ కార్యాదర్శి శ్రావణ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి, అక్టోబర్ 7: మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన కమ్మరి చింటూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఎమ్మెల్యే ఆ దేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులను కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్ వారిని ఓదార్చి, వారికి రూ. ఐదు వేలను అందజేశారు. కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ సామెల్, గ్రామ నాయకులు లక్ష్మయ్య, జీవన్‌గౌడ్, రామానంద్, రాజు, చాకలి శ్రీను, అనిల్ తదితరులున్నారు.